ప్రజాశక్తి
మంగళవారం 18 ఫిబ్రవరి 2025
5
కర్నూలు





వీకర్ సెక్షన్ కాలనీలోని పుచ్చలపల్లి సుందరయ్య పార్కు వద్ద 12 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, సంపు, పంపింగ్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి టిజి.భరత్

సుందరయ్య పార్కు నిర్వీర్యం..

- త్రిపుల్ ఐటి డిఎంకు నీళ్లందించేలా ఫిల్టర్ బెడ్ల ఏర్పాటుకు చర్యలు
- శంకుస్థాపన చేసిన మంత్రి భరత్
- నిన్నటి వరకూ పార్కు అభివృద్ధి అంటూ బుకాయింపు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న స్థానికులు

ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కుల నిర్వీర్యం అవుతున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో ఉన్న పార్కును నిర్వీర్యం చేసేందుకు పాలకులు, అధికారులు చర్యలు చేపట్టారు. జగన్నాథగట్టులోని త్రిపుట్ ఐటి డిఎంకు నీళ్లు అందించేందుకు సుందరయ్య పార్కులో ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేయనున్నారు. దీనికి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సోమవారం శంకుస్థాపన చేశారు. దాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు..



సుందరయ్య పార్కు వద్ద వేసిన శిలాఫలకం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పచ్చదనంతో కళకళలాడాల్సిన పార్కును నిర్వీర్యం చేసేందుకు కూటమి నాయకులు, అధికారులు చర్యలు చేపట్టారు. అది కూడా ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న పార్కు కాదు కర్నూలు నగరంలోని 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలోని సుందరయ్య పార్కు. కర్నూలు నగరంలో అత్యంత జనాభా వీకర్‌సెక్షన్ కాలనీలో ఉంది. ఇందులో సుమారు 25 వేల మందికిపైగా నివసిస్తున్నారు. కాలనీలో జనాభా పెరగడంతో కాలనీ వాసులకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించే దిశగా స్థానిక ప్రజాశక్తి కార్యాలయం ఎదురుగా పార్కును 2013 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. దీన్ని సుమారు రూ.12 లక్షలతో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పలువురు మంత్రులతో కలసి ప్రారంభించారు. సుందరయ్య పార్కుగా నామకరణం చేశారు. రక్షణ కోసం ప్రహరీ గోడను నిర్మించి తాత్కాలికంగా పచ్చని మొక్కలను నాటారు. తరువాత క్రమంగా పార్కును అధికారులు పట్టించుకోక పోవడంతో అభివృద్ధి అటకెక్కింది. కొన్నేళ్లకు ఆ ప్రాంతం మందు బాబులకు అడ్డాగా మారింది. పార్కు ప్రహరీ గోడ కూలిపోయింది. సుందరయ్య పార్కును అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సుందరయ్య పార్కు అభివృద్ధి కమిటీ, స్థానికులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. తీరా తుంగభద్ర పుష్కరాల తరువాత డ్రెయినేజీ వాటర్‌ను తుంగభద్రలో కలువకుండా మురుగు నీటి శుద్ధికోసం ఉపయోగించిన 2000 ప్లాస్టిక్ పైపులను పార్కులో ఉంచారు. దాదాపు రూ.50 లక్షల విలవజేసే పైపులను అక్కడ జనవాసాల మధ్య ఉంచినప్పుడు ఎలాంటి భద్రత ఏర్పాటు చేయలేదు. ఆకతాయిల గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సందర్భంగా ఒకటి, రెండు సార్లు ఆకతాయిలను పోలీసులు చెదరగొట్టారు. కానీ తరువాత పట్టించుకోలేదు. చివరికి అగ్ని ప్రమాదం జరిగి ఆ పైపులన్నీ కాలిపోయాయి. ఆ బూడిదను ఏళ్ల తరువాత శుభ్రం చేశారు. పార్కు స్థలాన్ని చదును చేశారు. ఏం చేస్తున్నారని అడిగిన స్థానికులకు పార్కును అభివృద్ధి చేస్తున్నామంటూ బుకాయించారు. తీరా ఆ పార్కు స్థలంలో సుమారు పది కిలో మీటర్ల దూరంలో ఉన్న జగన్నాథగట్టులోని త్రిపుల్ ఐటి డిఎంకు నీటిని అందించేందుకు ఫిల్టర్ బెడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రూ.22 కోట్లతో చేపట్టనున్న ఆ పనులకు సోమవారం పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేశారు. దీన్ని పార్కు అభివృద్ధి కమిటీ, స్థానికులు, పలు సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఆహ్లాదాన్ని పెంచేందుకు పార్కును అభివృద్ధి చేయాల్సిన నాయకులు ఉన్న పార్కును నాశనం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఒప్పుకునే ప్రసక్తే లేదు



2002లో కాలనీ ఏర్పడింది. ఏళ్ల కాలంగా పార్కును అభివృద్ధి చేయాలని అధికారులను, ఎమ్మెల్యేలను కలుస్తూనే ఉన్నాం. కనీసం వంద సార్లు విన్నవించాం. పార్కును అభివృద్ధి చేస్తామని చెప్పి రాత్రికి రాత్రి ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదు. కాలనీలో ఎక్కువగా వృద్ధులు ఉన్నారు. వారికి వాకింగ్ చేసుకునేందుకు పార్కు ఉపయోగపడుతుంది. ఫిల్టర్ బెడ్ల ఏర్పాటును ఒప్పుకునే ప్రసక్తే లేదు. అవసరమైతే మున్సిపల్ కార్పొరేషన్‌ను ముట్టడిస్తాం.

- కెఎస్ పద్మ, సుందరయ్య పార్కు అభివృద్ధి కమిటీ.

పార్కుగానే అభివృద్ధి చేయాలి



సుందరయ్య పార్కు స్థలాన్ని పార్కుగానే అభివృద్ధి చేయాలి. పార్కు స్థలంలో ఫిల్టర్ బెడ్ల ఏర్పాటు మాకొద్దు. కాలనీ మధ్య ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేయకూడదు. నగరానికి దూరంగా వాటిని ఏర్పాటు చేయాలి. పార్కును అభివృద్ధి చేసి అందరికీ ఆహ్లాదం అందేలా చూడాలి.

- యు.శ్రీనివాసులు, వీకర్ సెక్షన్ కాలనీ.

ఫిల్టర్ బెడ్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



అనేక సంవత్సరాలుగా పుచ్చలపల్లి సుందరయ్య పార్కును అభివృద్ధి చేయాలని నేతాజీ హౌసింగ్ కాలనీ, సోమిశెట్టి ఎస్టేట్ చుట్టుపక్కల కాలనీలో ప్రజలు కోరుతున్నప్పటికీ అభివృద్ధి చేయకుండా కాలయాపన చేస్తూ సుందరయ్య పేరు లేకుండా చేయాలని చూస్తున్నారు. నగరంలో అనేక స్థలాలు ఉన్నప్పటికీ కావాలని కక్షపూరితంగా సుందరయ్య పార్కులోనే ఫిల్టర్ బెడ్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం చాలా దారుణం. తక్షణమే దాన్ని ఉపసంహరించుకోవాలి. వేరే ప్రాంతంలో ఫిల్టర్ బెడ్ల నిర్మాణం చేసేలా చర్యలు చేపట్టాలి. కల్లూరు కాలనీలలో ఉన్న ప్రజలు రోజు ఫిల్టర్ నీళ్ల తాగాలని 25 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు. విశాలమైన స్థలంలో ఫిల్టర్ బెడ్ల నిర్మాణాన్ని చేపట్టి కల్లూరు కాలనీలో ప్రజలకు రోజూ తాగునీరు అందించాలి.

- టి.రాముడు, సిపిఎం న్యూసిటీ కార్యదర్శి.

సాంకేతికతతో సమస్యల పరిష్కారం వేగవంతం

- మంత్రి టిజి భరత్, కలెక్టర్ పి.రంజిత్ బాషా
- రూ.28.12 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సమాజంలో మారుతున్న కాలానికను గుణంగా అధునాతన సాంకేతిక సేవల విని యోగంతో, కష్టతరమైన సమస్యలను సైతం వేగవంతంగా పరిష్కరించవచ్చని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి. భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అన్నారు. సోమవారం కర్నూలు నగరంలో రూ.28.12 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి, కలెక్టర్‌తో పాటు మేయర్ బివై. రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు భూమిపూజ చేశారు. ముందుగా అశోక్ నగర్ నీటి శుద్ధి కేంద్రం వద్ద రూ.4.62 కోట్లతో నీటి వ్యవస్థ నిర్వహణకు పర్యవేక్షక వ్యవస్థ, సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్ (స్కాడ)ను, రూ.1.5 కోట్లతో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 3 శుభ్రత పనుల యంత్రాల వాహనాలు, 2 చెత్త సేకరణ ఎలక్ట్రికల్ వాహనాలను ప్రారంభించారు. అనంతరం జగన్నాథ గట్టు మీదున్న ట్రిపుల్ ఐటీకి, కల్లూరు ప్రాంతంలో వివిధ ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు వీకర్ సెక్షన్ కాలనీలోని పుచ్చలపల్లి సుందరయ్య పార్క్ వద్ద రూ.22 కోట్లతో 12 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, సంపు, పంపింగ్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా నగరంలో దశాబ్దాల నుండి ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కల్లూరు ప్రాంతంలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వంలో నామమాత్రపు జీవో జారీ చేశారని, బడ్జెట్ లేకుండా టెండర్ పిలిచేవారని విమర్శించారు. చిత్తశుద్ధితో నిజంగా కృషి చేసింటే ఈపాటికి పనులు పూర్తి అయ్యేవని, అయితే గత ప్రభుత్వంలో అది జరగలేదన్నారు. నగరానికి చుట్టూ నదులు ఉన్నా నగర ప్రజలకు నీటి సమస్య తప్పలేదని, నూతన కాలనీల్లో నీటి సమస్య అధికంగా ఉందన్నారు. దీని పరిష్కారం కోసం పాణ్యం ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకున్నారని, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు అర్థం చేసుకుని, ఆర్థిక ఇబ్బందుల్లో సైతం రూ.22 కోట్లు మంజూరు చేశారని, అందుకు ఎమ్మెల్యేకు, సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. స్కాడ వ్యవస్థ సైతం గత ప్రభుత్వంలో ప్రచార ఆర్భాటం చేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే దీనిని తాత్కాలిక వ్యవస్థ ఏర్పాటు చేశామని, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అమలు చేస్తున్న విధంగా భవిష్యత్తులో దీనిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. దీని వల్ల నీటి ప్రవాహం, నీరు ఎక్కడెక్కడికి ఎంత వెళ్తున్నాయి, ఔట్ ఫ్లో, ఇన్ ఫ్లో, పైపు లీకేజీ వంటి వివరాలను స్కాడ నిరంతర పర్యవేక్షణ వల్ల వెంటనే తెలుసుకోవచ్చని తెలిపారు. ఫలితంగా రోజువారీ తాగునీటి అవసరాలు, పరిష్కారాలు కనుక్కోవచ్చని, ఇవి మంచి సత్ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు నగర పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో తాగునీటి సమస్యను కచ్చితంగా పరిష్కారిస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వేసవి సమీపిస్తున్న తరుణంలో దీర్ఘకాలికంగా ఉన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తుందన్నారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో తాగునీటి సమస్యల పరిష్కారం చాలా ఇబ్బందిగా ఉండేదని, స్కాడ వ్యవస్థ వినియోగం వలన శ్రమ లేకుండా, నీటి వృథా లేకుండా చకచకా సులువుగా సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కారం కావాలంటే గోరుకల్లు రిజర్వాయర్ నుండి నీటిని సరఫరా చేసుకోవాల్సిన అవసరం ఉందని, దాని కోసం ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేయబోతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు పరమేష్, రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఈలు సత్యనారాయణ, శేషసాయి పాల్గొన్నారు.

ప్రజల ప్రాణ, మానాలకు రక్షణ కరువు

- రాయలసీమ, ఉత్తరాంధ్ర పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రజల ప్రాణ, మానాలకు రక్షణ కరువయిందని, రాయలసీమ, ఉత్తరాంధ్రలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాడానికి రాష్ట్ర మొత్తం బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని సిఆర్ భవన్‌లో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహా కుంభమేళా సందర్భంగా జరుగుతున్న ప్రమాదాలపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోగా 144 సంవత్సరాలకు ఒకసారి కుంభమేళా వస్తుందని పెద్దఎత్తున ప్రచారం చేయడం దారుణమన్నారు. ప్రధాని నరేంద్రమోడీ అదానీ, అంబానీ కోసం పని చేస్తున్నట్లు ఉందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ ప్రభుత్వం కూడా ఇంత నిసిగ్గుగా, నిర్లజ్జగా పని చేయలేదన్నారు. రాష్ట్రంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు హెడ్ అఫీసును కడప నుండి అమరావతికి మార్చాలని నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. విశాఖలో ఉన్న కృష్ణా బోర్డును వెంటనే కర్నూలుకు మార్చాలని కోరారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ పెడతామంటే కోర్టులో పిల్ వేయడం దారుణమన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలోని పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని, బడ్జెట్లో 10 శాతం నిధులు కేటాయించాలని, ఇప్పటికే సీఎం, ఆర్థిక మంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రిని కలసి కోరామని, మరోసారి కలిసి కోరతామన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజ నేయులు, ఎన్.లెనిన్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, జిల్లా కార్యవర్గ రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతు రుణాలను మాఫీ చేయాలి : ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల రుణాలన్నిటినీ మాఫీ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.కష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలు రెవెన్యూ డివిజన్‌లో ప్రధానంగా పత్తి, కంది, ఆముదాలు, శనగలు, జొన్న, పొగాకు, మిరప పంటలు వేశారని, వర్షాలు సక్రమంగా కురవక, దిగుబడి అంతంత మాత్రమే వచ్చిందన్నారు. వచ్చిన దిగుబడికి కూడా సరైన మద్దతు ధర లేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రైతుల పట్ల, వ్యవసాయం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపుతో ఉన్నాయని, నూటికి 70 శాతం మంది ప్రజలు ఇప్పటికీ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ ఈ రంగానికి కేటాయించాల్సిన నిధులు బడ్జెట్‌లో కేటాయించడంలో తీవ్రంగా విఫలం చెందారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నిధులు పెంచాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కందులు, ఇతర పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అలాగే రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరు లైన్ల రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు, పైపులైన్లు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో రైతులను, పేదలను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం కర్నూలు ఆర్‌డిఒకు వినతి పత్రం అందించారు. ఆర్‌డిఒ స్పందిస్తూ రైతులు, పేదల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, కర్నూలు మండల గౌరవాధ్యక్షులు బాలపీర, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, సిఐటియు నాయకులు మధు, రైతు సంఘం ఓర్వకల్లు మండల కార్యదర్శి మధుసూదన్, నాయకులు ఇస్మాయిల్, బడేసాహెబ్, కృష్ణ, మద్దిలేటి, నాగన్న, లోకన్న, శివన్న, సీతారాముడు, ఈశ్వరయ్య, ఆంజనేయులుతోపాటు నన్నూరు, కన్నమడకల, బసాపురం, గొందిపర్ల, పంచలింగాల, ఉల్చాల గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కారాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా కలెక్టర్, జెసి డాక్టర్ బి.నవ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపుతున్నారా లేదా అని, ప్రతి ఫిర్యాదును ఆయా శాఖల అధికారులు ఆడిటింగ్ కూడా చేయాలని తెలిపారు. ఆడిట్‌లో నాణ్యమైన పరిష్కారం చూపలేదని గుర్తిస్తే, వారికి మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రీ ఓపెన్ ఫిర్యాదులకు త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లాగిన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జెసి బి.నవ్య మాట్లాడుతూ... రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా, నాణ్యతతో పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. రీసర్వే గ్రామసభల దరఖాస్తులకు సంబంధించి 415 రీ ఓపెన్ ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి నిర్దేశిత సమయం లేదని జాప్యం చేయకూడదని అన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బికె.వెంకటేశ్వర్లు, కొండయ్య పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

అంగన్వాడీల వేతనాలు పెంచాలి

- సిడిపిఒ కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కర్నూలు అర్బన్ సిడిపిఒ కార్యాలయం సమీపంలో ఆందోళన చేపట్టారు. బాలదుర్గమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు సేవ చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచకపోవడం దురదృష్టకరమని తెలిపారు. 42 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం మారిన తర్వాత కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చలేదని, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టిఎ బిల్లులు చెల్లించాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రేణుకమ్మ, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ మాట్లాడారు. సిఐటియు నగర నాయకులు సుధాకరప్ప, మహ్మద్ రఫీ, నరసింహులు, సిఐటియు కర్నూలు మండల కార్యదర్శి హుస్సేనయ్య, సిఐటియు నగర నాయకులు ఏసు, అంగన్వాడీ యూనియన్ నాయకులు నాగమణి, సునీత, సరళ, కృష్ణవేణి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. **కోడుమూరు (రూరల్)** ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి విజయభారతి అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, గూడూరు మండల కార్యదర్శి జె.మోహన్, కోడుమూరు మండల కార్యదర్శి జిపి.వీరన్న, యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు విజయభారతి మాట్లాడారు. యూనియన్ ప్రాజెక్టు నాయకులు సూలమ్మ, అరుణ, సుజాత, రత్నమ్మ, అరుణ, అనంతమ్మ, హైమావతి, ఫాతిమా, సునంద, రామాంజనమ్మ పాల్గొన్నారు.



కర్నూలులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కోడుమూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాధితులకు న్యాయం చేస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం మొత్తం 102 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై స్పందించి పరిష్కరించాలని తెలిపారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ట్రెయినీ డీఎస్పీ ఉషశ్రీ, సిఐలు శ్రీనివాస నాయక్, శివశంకర్ పాల్గొన్నారు.

కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ తనిఖీ

నగరంలోని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు, పోలీసు సిబ్బందికి సూచించారు. సిబ్బంది పని తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తగిన సూచనలు, సలహాలు చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. 'నేను సైబర్ స్మార్ట్' అనే అవగాహన కార్యక్రమంతో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించి సైబర్ నేరాల బారిన పడకుండా చేయాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను డిస్పోజబుల్ చేయాలన్నారు. యుఐ కేసులు తగ్గించాలన్నారు. రాత్రి గస్తీ పెంచాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ చేయాలన్నారు. నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ సిఐ మధుసూదన్ గౌడ్, ఎస్ఐలు షమీర్ బాషా, చంద్రశేఖర్, గోపినాథ్ ఉన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు రాజగోపాల్ మృతి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



సిపిఎం సీనియర్ నాయకులు కె.రాజగోపాల్ సోమవారం రాత్రి మృతి చెందారు. రాజగోపాల్ రాయలసీమ పేపర్ మిల్లులో కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించి ప్రజానాట్యమండలి కళాకారునిగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య పరిచేందుకు కృషి చేశారు. పేపర్ మిల్లులో కార్మిక నేతగా అంచెలంచెలుగా ఎదుగుతూ కర్నూలు నగర నాయకునిగా, సిఐటియు జిల్లా నాయకునిగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. బండి మెట్టలో సిపిఎం కార్పొరేటర్‌గా గెలిచి ప్రజా సమస్యలపై కార్పొరేషన్‌లో తన గళాన్ని వినిపించారు. సిపిఎం నగర నాయకునిగా, జిల్లా నాయకునిగా చివరి క్షణం వరకు ఎర్రజెండా జీవితాన్ని కొనసాగించారు. కె.రాజగోపాల్ మరణం జిల్లా సిపిఎంకు, కార్మిక వర్గానికి, ప్రజలకు తీరని లోటని సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు తెలిపారు.

'ఉపాధి'ని దూరం చేయడం తగదు : సిపిఎం

ప్రజాశక్తి - గూడూరు

పట్టణానికి నగర పంచాయతీ పేరుతో ఉపాధి హామీ చట్టం కల్పించకపోవడం బాధాకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గూడూరులో ఉపాధి హామీ పనులు కల్పించాలని, వలసల నివారణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే మండలంలోని రాజకీయ, ప్రజా సంఘాలు, ప్రముఖులతో చర్చ వేదిక జరిపి ఈ ప్రభుత్వంపై ఉద్యమించడానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి జె.మోహన్, మండల కమిటీ సభ్యులు రాజశేఖర్, నాయకులు రంగన్న, గంగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ

విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన టిడిపి నాయకులు వేణుగోపాల్ నాయుడును అరెస్టు చేయాలని జర్నలిస్టు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో జర్నలిస్టు సంఘాలు ధర్నా చేపట్టారు. అనంతరం జెసి డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం అందజేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు టి.మద్దిలేటి, బి.గోరంట్లప్ప, పానుగంటి చంద్రయ్య, కె.నాగేంద్ర, కెవి.శ్రీనివాసులు, జర్నలిస్టు సంఘాల జెఎసి కన్వీనర్ టిజి.ప్రసాద్, యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు విజయ్, ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ వినయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ప్రజాశక్తి విలేకరి రామారావు వార్త రాస్తే జీర్ణించుకోలేని టిడిపి నేతలు దాడికి పూనుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టి రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కర్నూలు హాస్పిటల్: విధి నిర్వహణలో ఉన్న ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన టిడిపి మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాల నాయుడుపై చర్యలు తీసుకోవాలని యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) నాయకులు కోరారు. అధ్యక్ష, కార్యదర్శులు బి.చిన్న రామాంజనేయులు, సీలం సత్యనారాయణ ఆధ్వర్యంలో కల్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కె.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. యుజెఎఫ్ నాయకులు విజయ్ కుమార్, రాజశేఖర్, లోకేష్, జేమ్స్, టి.లక్ష్మినారాయణ, పురుషోత్తం, ఎం.రమేష్, వై.వెంకటేశ్వర రెడ్డి, శేఖర్, జనార్దన్, దేవరాజ్, శ్రీరాములు పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అవినీతి రహిత ఆంధ్రప్రదేశ్ ధ్యేయం

- 'అశోక చక్రం'.. ఆంధ్రప్రదేశ్ టీంకు గర్వకారణం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


అవార్డును అందజేస్తున్న సభ్యులు

అవినీతి రహిత ఆంధ్రప్రదేశ్ చూడాలన్నదే తమ ధ్యేయమని ఈ-కరప్షన్ ఆపరేషన్ కమిటీ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి రోజా పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో టిజె.ప్రకాష్ రావు నివాసంలో నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు రాజేష్ శుక్లా ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి రోజా పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ టీంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవినీతి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ ఇన్‌ఛార్జీ మాదిగుండు ఈరన్నకు అశోక్ చక్రం బ్యాడ్జి ప్రదానం చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ టిజె.ప్రకాష్ రావు చేతులమీదుగా సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా అధ్యక్షులు రాబియా, మహారాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్, జిల్లా ప్రెసిడెంట్ దస్తగిరి, వైస్ ఛైర్మన్ సంతోష్ కుమార్, మోహన్ రెడ్డి, ఛాయా వీరేష్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రావు, వడ్డే ఆంజనేయులు, బండ సోమశేఖర్, నాయుడు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- నిర్వాహకులు ప్రకాష్

ప్రజాశక్తి - కౌతాళం



మాట్లాడుతున్న ప్రకాష్

సోషల్ ఇంపాక్ట్ అలియన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు హెచ్‌కె.ప్రకాష్ కోరారు. సోమవారం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న మహిళల పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి, కులమత బేధాలు లేకుండా ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందడానికి 18 ఏళ్ల పైబడిన వారు, ఐదో తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టైలరింగ్ మాస్టర్ కె.వలీ సాబ్, సహాయకులు నరసప్ప, ఏబు, సురేష్ బాబు, రాజు, మహిళలు పాల్గొన్నారు.

కొత్త సిసి రోడ్లతో కాలనీలు కళకళ

- సోమప్ప నగర్‌లో సిసి రోడ్డు పనులను పరిశీలించిన టిడిపి నాయకులు విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


సిసి రోడ్ల పనులను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

కొత్త సిసి రోడ్లతో పట్టణంలోని కాలనీలు కళకళలాడుతున్నాయి. పట్టణంలో 30వ వార్డు సోమప్ప నగర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి చేస్తున్న అభివృద్ధిలో భాగంగా నూతన సిసి రోడ్ల పనులను సోమవారం టిడిపి నాయకులు సి.విజయలక్ష్మి ప్రారంభించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నూతన రోడ్లతో పట్టణ కాలనీలు కళకళలాడుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో రోడ్లు, డ్రెయినేజీ, మురుగుదొడ్లు లేక కాలనీలు అన్ని అస్తవ్యస్తమయ్యాయాని విమర్శించారు. తమ నాయకుడు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షం కూడా నివ్వెర పోతోందని తెలిపారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే మాట్లాడి ఎన్నో అభివృద్ధి ప్రాజెక్టులను తీసుకొచ్చారని చెప్పారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్ సతీష్‌కు తెలిపారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కాలనీ వాసులతో మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించారు.

బసాపురంలో క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం


క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ప్రదీప్ రెడ్డి

మండలంలోని 52 బసాపురం గ్రామంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి, మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డితో కలిసి నూతన క్లినిక్‌ను ప్రారంభించారు. సోమవారం బసాపురం గ్రామానికి చెందిన కురువ పూజారి మల్లికార్జున గ్రామంలో ప్రాథమిక వైద్య చికిత్స కోసం ప్రారంభించాలని ఆహ్వానించిన నేపథ్యంలో ఆయన గ్రామానికి చేరుకొని రిబ్బన్ కట్ క్లినిక్‌లోకి ప్రవేశించారు. శాలువా, పూలమాలలు వేసి ఇద్దరు నాయకులను సన్మానించారు.

రైతు కష్టాలు పట్టని ప్రభుత్వాలు


- **మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలి**
- **రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు**


ప్రజాశక్తి - ఆదోని రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మిరప రైతుల కష్టాలు పట్టడం లేదని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు విమర్శించారు. సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట మిరప రైతులు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి టి.అయ్యప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మిరప పంటను సాగు చేసిన రైతులకు కనీసం రూ.50 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. గతేడాది 12 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రాగా ఈ ఏడాది ఐదు క్వింటాళ్లు వచ్చిందని చెప్పారు. ఈసారి సగానికి సగం తాలు కాయలు వచ్చాయని, అలాగే ధర సగానికి తగ్గిందని తెలిపారు. మిరప రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు బాష, మండల నాయకులు తిక్కన, మునిస్వామి, అయ్యన్న, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఉచ్చీరప్ప, రైతులు పాల్గొన్నారు. **దేవనకొండ** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా వ్యకాస, రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టారు. వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, సీనియర్ నాయకులు బజారి, మహబూబ్ బాషా మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో మండలంలో 4 వేల ఎకరాల్లో మిరపను సాగు చేశారని, పెట్టుబడులు విపరీతంగా పెరిగాయని, రైతు పెట్టుబడులు పెట్టి కాయకష్టం చేసి పంటను పండించారని తెలిపారు. క్వింటాకు రూ.8 వేల నుంచి రూ.11 వేల ధర ఉండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వాపోయారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. బ్యాడి మిర్చి క్వింటాకు రూ.50 వేలు, గుంటూరు మిరపకు రూ.25 వేల మద్దతు ధరగా ప్రకటించాలని కోరారు. మిరప సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదని, దాటవేత ధోరణి అవలంభిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర వచ్చేటట్లు ప్రభుత్వం జోక్యం చేసుకొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వ్యకాస, రైతు, కార్మిక సంఘం నాయకులు పాండు, లక్ష్మిరెడ్డి, సుధాకర్, రవీంద్ర, లోకయ్య, నాగేంద్ర, బలరాముడు, రాముడు, మహేష్ పాల్గొన్నారు. **ఆలూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట మిరప రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.హనుమంతు, మండల నాయకులు విఠల్ మాట్లాడారు. మిరప పంటకు మద్దతు ప్రకటించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. **మంత్రాలయం** తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, రైతుసంఘం నాయకులు జి.అంజి అధ్వర్యంలో తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం గౌరవాధ్యక్షులు హెచ్.జయ రాజు, నాయకులు భాస్కర్ యాదవ్ మాట్లాడారు. తుంగభద్ర నది పరివాహక ప్రాంతంలో, ఎల్ఎల్‌సి కింద, బోరుబావుల కింద మిరపను సాగు చేశారని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం నుంచి నీరు కిందికి రాకపోవడం, తెగులు వంటి కారణాలతో మిరప దిగుబడి తగ్గిపోయిందని చెప్పారు. రైతులు వీరనాగన్న, జాను, శాంతిరాజు, నరసన్న, మోహన్, గీతమ్మ పాల్గొన్నారు. **నందవరం** మండలంలో మిరప సాగుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు దేవిపుత్ర డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో వేల ఎకరాల్లో మిరప పంట సాగు చేసి అప్పులో కూరుకుపోయారని తెలిపారు. ఈఏడాది వివిధ రకాల వైరస్‌లు మిరపను నాశనం చేశాయని, మిరప ధర తగ్గడం రైతుల పాలిట శాపంగా మారిందని చెప్పారు. రైతులు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని, బ్యాంకులో తీసుకున్న రుణాలను ప్రభుత్వం రద్దు చేస్తూ, ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు స్వామిదాసు, జయరాజు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి, తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రైతుసంఘం మండల కార్యదర్శి లక్ష్మీ నరసయ్య అధ్యక్షత వహించారు. రైతు సంఘం మండల అధ్యక్షులు అబ్దుల్లా, నాయకులు గోవిందు మాట్లాడారు. రైతుసంఘం నాయకులు రాముడు, సురేష్, రైతులు రమేష్, రాకేష్, రామన్న, బజారి, నాగేష్, తాయన్న పాల్గొన్నారు. **చిప్పగిరి** తహశీల్దార్ కార్యాలయంలో రైతు సంఘం నాయకులు ఈరన్న ఆధ్వర్యంలో తహశీల్దార్ ఇజాద్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం ఆలూరు కార్యదర్శి ఈరన్న మాట్లాడారు. మిరప సాగుకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి ధర లేక రైతు నష్టపోతూనే ఉన్నారని తెలిపారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు. రైతుసంఘం మండల అధ్యక్షులు నగరడోన ఉప్పర గోపాల్, మిరప రైతులు పరమేష్, మధు, శివ, నాగేంద్ర పాల్గొన్నారు. **హొళగుంద**లో తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి, డిప్యూటీ తహశీల్దార్ ముకుందరావుకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేష్, వి.రామాంజనేయులు, గోవిందు, రవికుమార్, ఈరన్న, సుంకన్న, హనుమంతు పాల్గొన్నారు. **ఆస్పరి** తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఇన్‌ఛార్జీ తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి,సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, సిపిఎం మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, రవి, ఈరన్న, రైతు, వ్యకాస నాయకులు వెంకట రాముడు, షేక్షావలీ, శీనప్ప, పరశురాముడు, తిప్పన్న పాల్గొన్నారు. **హాలహర్వి** తహశీల్దార్ కార్యాలయం ఎదుట మిరప రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.హనుమంతు, మండల కార్యదర్శి ధనంజయ్, మండల నాయకులు విఠల్, అనంతరం తహశీల్దార్ నజ్మ భానుకు వినతిపత్రం అందించారు. రామాంజిని, నాగన్న గౌడ్, లింగన్న, ఈరన్న, హెచ్.ఈరన్న, ఎం.సుధాకర్, కేదార్ గౌడ్, మల్లయ్య, బల్లారప్ప, మణికంఠ, రవి పాల్గొన్నారు. **పెద్దకడబూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, గిట్టుబాటు ధర కల్పించాలని మిరప కాయలను దహనం చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్, వ్యకాస నాయకులు తిక్కన్న, డివైఎఫ్ఐ నాయకులు దేవదాసు, సిఐటియు నాయకులు ఈరన్న, రైతులు పాల్గొన్నారు.



ఆదోనిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


దేవనకొండలో


ఆలూరులో...



ఎమ్మిగనూరులో


నందవరంలో


చిప్పగిరిలో


పెద్దకడబూరులో దహనం చేస్తున్న నాయకులు

అంగన్వాడీలకు రూ.26 వేల వేతనమివ్వాలి

- యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీలకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వ పట్టించుకోవడం లేదని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ విమర్శించారు. సోమవారం ఆదోని సిడిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, సూపరిటెండెంట్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన, గోపాల్, ప్రాజెక్టు అధ్యక్షులు వరలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ, ప్రాజెక్ట్ నాయకులు పద్మమ్మ, సరోజ మాట్లాడారు. అంగన్వాడీ సంస్థను బలోపేతం చేయాలని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులను పంపిణీ చేయాలని, అంగన్వాడీ బలోపేతానికి బడ్జెట్ పెంచాలని కోరారు. సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు సోమక్క, రిజ్వానా, మీనా కుమారి, గీత, లలిత, లక్ష్మీదేవి, కరుణ, ఉషారాణి, రేణుక ఉన్నారు. **ఆస్పరి** సిడిపిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయు లు మాట్లాడారు. అనంతరం సిడిపిఒ మద్దమ్మకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల గౌరవాధ్యక్షులు బాలకృష్ణ, యునియన్ నాయకులు జ్యోతి, విశ్వకుమారి, రాధా, బేగం, లక్ష్మీదేవి, మహబూని, లత పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లో ర్యాలీ నిర్వహించి, సిడిపిఒ కార్యాలయం ఎదుట 250 మందితో ధర్నా చేపట్టారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్ట్ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, అర్బన్ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు మాట్లాడారు. అంగన్వాడీ నాయకులు నాగేశ్వరమ్మ, అరుణ, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, పుష్పావతి, శారద, లక్ష్మి, సమియా, మున్నీ, లత, శశికళ, చిట్టెమ్మ, నిర్మల, శమంతకమణి, శ్రీదేవి, అక్తర్, శ్రీదేవి, యుఎం.నాగలక్ష్మి పాల్గొన్నారు. **మంత్రాలయం** ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు మండల నాయకులు ప్రాణేష్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి, సీనియర్ అసిస్టెంట్ వలీకి వినతిపత్రం అందజేశారు. సిఐటియు డివిజన్ నాయకులు రామన్న, జయరాజు, మండల కార్యదర్శి భీమేశ్వరి, ప్రాజెక్టు కార్యదర్శి హెప్సిబా, విశాలాక్షి, అంగన్వాడీలు ప్రమీల, నరసమ్మ, లావణ్య, స్వప్న, లూసియా, కల్యాణి, రాధా పాల్గొన్నారు. **ఆలూరు** ఐసిడిఎస్ ప్రాజెక్టులో ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, నాయకులు మైనా, గోవర్ధన్, అంగన్వాడీలు పాల్గొన్నారు.


మంత్రాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఆదోనిలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


ఆస్పరిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఎమ్మిగనూరులో ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు



ఎటిఎం పనిచేయదు.. అధికారులు స్పందించరు..!

- సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎటిఎం పనిచేయదని, అధికారులు స్పందించరని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. కౌతాళం మండలం కర్ణాటక సరిహద్దు ప్రాంతమని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ పక్కనే ఎటిఎం ఏర్పాటు చేశారని తెలిపారు. 20 రోజులైనా ఎటిఎం మూతవేయడంతో అలంకారప్రాయంగా ఉందన్నారు. బ్యాంకులు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు లావాదేవీలు జరుగుతాయని తెలిపారు. మిగిలిన సమయం లో డబ్బులు అవసరమైతే ఎటిఎంకు వెళ్లి డబ్బులు తీసుకునేవారని, కౌతాళంలో 20 రోజు లైనా బ్యాంకు సిబ్బంది ఎటిఎం గురించి పట్టిం చుకోవడం లేదని చెప్పారు. ఎటిఎం సేవలు ఇవ్వడంతో ఈ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఇబ్బందుల పరిష్కారం కోసం అధికారులు ఎటిఎంను పునరుద్ధరించాల ని కోరారు. లేకపోతే బ్యాంకు ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని పెద్దహేట గ్రామానికి చెందిన చలవాది యశోద (32) కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమె కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ఇనుప గరండాకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి తండ్రి తిప్పేస్వామి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మిరాం నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కమనీయం.. గాయత్రి మాత ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని శంకరబండ గ్రామ సమీపంలోని రామతీర్థం కొండల్లో వెలసిన శ్రీపంచముఖి గాయత్రి మాత ఉత్సవాలు సోమవారం కమనీయంగా సాగాయి. గాయాత్రీమాత ఉత్సవాల్లో భాగంగా భక్తులు, దాతలు సహకారంతో రూ.12 లక్షలతో నూతన రతోత్సవాన్ని, 12 జ్యోతిర్లింగాలు, నంది, అభయాంజనేయస్వామి విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన చేయించినట్లు ఆలయ నిర్వాహకులు రూపామోహన్ శర్మ తెలిపారు. సాయంత్రం రథోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముందుకు లాగారు. అనంతరం యథాస్థానానికి రథోత్సవం చేరుకోవడంతో ఉత్సవాలు ముగిశాయి. రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక పక్క జిల్లాల నుంచి భక్తులు రావడంతో ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

గాయత్రి మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి


గాయత్రి మాత ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బి.విరుపాక్షి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం రథోత్సవానికి పూజలు చేసి ముందుకు లాగారు. శ్రీనివాస్ నాయన, జడ్‌పిటిసి దొరబాబు, సర్పంచి విజయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ బసవరాజు, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన్, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, కెడిసిసి జిల్లా బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, యూత్ తాలూకా అధ్యక్షులు అశోక్, నాయకులు దత్తాత్రేయ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, తిమ్మప్ప, ప్రకాష్, ప్రభాకర్, ఎల్లప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.


గాయత్రి మాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విరుపాక్షి

సామూహిక వివాహాలకు విరాళం

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద శివ స్వాముల శివభక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వివాహాలకు తెలుగు యువత రాష్ట్ర మాజీ కార్యదర్శి చిన్నహ్యాట శేషగిరి రూ.5 వేల విరాళం అందజేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. శివ స్వాములు సామాజిక బాధ్యతగా సామూహిక వివాహాల నిర్వహణకు పూనుకోవడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. శివస్వాములు జమ్మన్న, సిద్ధలింగ, మౌనేష్ ఆచారి మాట్లాడుతూ... అడిగిన వెంటనే విరాళం అందించిన శేషగిరికి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు దుర్గయ్య, తోక వెంకటేష్, కురువ మల్లికార్జున పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న శేషగిరి


కమనీయంగా.. వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

ప్రజాశక్తి - పత్తికొండ

పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం సోమవారం కమనీయంగా సాగింది. బ్రహ్మంగారి ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామికి మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి కెఇ.కృష్ణ మూర్తి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి రథానికి కొబ్బరికాయ కొట్టి ముందుకు కదిలించారు. ఆర్‌డిఒ భరత్ నాయక్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ పర్ల శ్రీనివాసులు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, ఆలయ ధర్మకర్త ఎల్లారెడ్డి, టిడిపి నాయకులు తుగ్గలి నాగేంద్ర, సోమలింగడు, కెపి.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి దర్శించుకున్న శ్రీదేవి : మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, సర్పంచి కొమ్ముదీపిక స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎల్లారెడ్డి శ్రీదేవికి శాలువా వేసి సన్మానించారు. ఎంపిపి నారాయణదాసు, మండల కన్వీనర్ కారం నాగరాజు, వైసిపి నాయకులు బనగాని శ్రీనివాసులు, బాబుల్ రెడ్డి, మాజీ సర్పంచి సోమశేఖర్ పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే



రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - ఆస్పరి

శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు ఆస్పరి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు శాంతప్ప, రామ్ రెడ్డి, నాగేష్, ఆచారి తెలిపారు. సోమవారం ఉదయం శ్రీపకీరప్ప తాత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కెడిసిసి బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 17 నుంచి 21 వరకు కర్నూలు రోడ్డు పక్కన ఉన్న శ్రీపక్కీరప్ప తాత దేవాలయం దగ్గర 24 గంటల పాటు భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు జ్వరం, కాళ్ల నొప్పులు, జలుబు తదితర సమస్యలకు మాత్రలు కూడా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేవా సమితి సభ్యులు రామాంజనేయులు, గాదిలింగ, మల్లికార్జున, కృష్ణ, వీరేష్, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు.


అన్నదానం నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

శివ స్వాముల శోభాయాత్ర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలం పెద్దహరిహాణం గ్రామంలో శివ స్వాములు సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ముందస్తుగా గ్రామంలోని పురవీధుల్లో శివస్వాముల ఆధ్వర్యంలో శివుని చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక శివ, సాయి, గణేష్ దేవాలయం నుంచి వాహనంపై చిత్రపటాన్ని ఉంచి శివ స్వాములు గోరవయ్య నృత్యాలు, గ్రామంలో విజేత స్కూల్ నుంచి వేషధారణలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాంప్రదాయ గీతాలకు నృత్యాలు, భజనలు చేస్తూ భక్తి గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు.

పాదయాత్రికులకు అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని పట్టణ శివారులో ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డుపై అల్కూరు మఠం విజయ్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో శ్రీశైలం యాత్రికులకు సోమవారం నుంచి ఉచిత అన్నదానం ప్రారంభించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు అన్నదానాన్ని ప్రారంభించారు. కర్ణాటకతో పాటు మహారాష్ట్ర నుంచి ఆదోని మీదుగా వెళ్లే యాత్రికులకు అన్నదానం ఎంతో ఉపయోగంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


అన్నదానం చేస్తున్న నాయకులు

కనులపండువగా రథోత్సవం

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి రేణుక ఎల్లమాంబ రథోత్సవం సోమవారం అశేష జనవాహిని మధ్య కనుల పండువగా సాగింది. సాంప్రదాయ బద్ధంగా కోసిగి దొరల వంశస్తులైన మురళీ దొర, శ్రీనివాస్ దొర ఇంటి నుంచి పూర్ణకుంభాన్ని మేళాతాళాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అమ్మవారి గుడి దగ్గరికి ప్రత్యేక పూజలు, రథోత్సవం లాగారు. రథోత్సవం సందర్భంగా రేణుక ఎల్లమాంబకు ఆలయ అర్చకులు మూర్తి గౌడ్, గౌరి గౌడ్, మల్లయ్య ఆధ్వర్యంలో ఎల్లమాంబకు తెల్లవారు జాము నుంచి కుంకుమార్చన, ఫల, పుష్ప అలంకరణ, మహా మంగళహారతులు వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో గత మూడు రోజుల నుంచి సర్పంచి అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. సాయంత్రం వేలాదిమంది భక్తుల నడుమ ఆలయం నుంచి పాదాల వరకు రథోత్సవం లాగి తిరిగి యథాస్థితికి చేర్చారు. వైసిపి, టిడిపి, బిజెపి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోసిగి సిఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వక్ఫ్ భూమిని సర్వే చేయాలి : ముస్లింలు

ప్రజాశక్తి - గోనెగండ్ల


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

గోనెగండ్లలోని వక్ఫ్ బోర్డుకు చెందిన భూమిని సర్వే చేయించాలని గ్రామానికి చెందిన ముస్లింలు కోరారు. సోమవారం తహశీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గోనెగండ్ల పంచాయతీలోని సర్వే నెంబరు 641/ఎ1లో 2.09 ఎకరాల భూమి ఉందన్నారు. వక్ఫ్ బోర్డుకు చెందిన ఈ భూమి ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి కేటాయించిందన్నారు. ఈ భూమిని వీలైనంత త్వరగా సర్వే నిర్వహించి హద్దులు కనబరిచి కంచె వేయించాలని కోరారు. ఎస్ఎన్.మహబూబ్ వలీ, పేట మహ్మద్, దరగల ఖాజా, రాంపురం షేక్షావలీ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

- 20 మంది ఎంపిక

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎపిఎస్ఎస్‌డిసి, ప్రిన్సిపల్ యు.పద్మావతి ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, ప్లేస్‌మెంట్ అధికారి సాయి తేజ, కోడుమూరు స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ హరి బాబు, ఎపిఎస్ఎస్‌డిసి సిబ్బంది హాజరయ్యారు. కంపెనీ అధికారులు క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ సందీప్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ నాగరాజు పాల్గొన్నారు. జాబ్ మేళాకు మొత్తం 36 మంది నిరుద్యోగులు హాజరు కాగా 20 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు.